క్లుప్తంగా

అందరి చూపు గొందిగూడెం వైపే..

అశ్వాపురం: మండలంలో 12 ఎంపీటీసీ స్థానాలు ఉండగా రిజర్వేషన్లలో ఒకే ఒక్క జనరల్ ఎంపీటీసీ స్థానం గిరిజన గ్రామమైన గొందిగూడెం కావడంతో అందరి చూపు గొందిగూడెం వైపు ఉంది. మారుమూల గిరిజన గ్రామమైన గొందిగూడెం ఎంపీటీసీ స్థానం కేంద్రంగా రసవత్తర రాజకీయం జరిగే అవకాశం ఉంది. ఎంపీపీ ఎస్టీ కావడంతో మండలంలో అధికార, ప్రతిపక్ష పార్టీల ముఖ్య నాయకులు ఆ స్థానాన్ని దక్కించుకొని కనీసం వైస్ ఎంపీపీ అయినా దక్కించుకునే ఆలోచనలో ఉన్నారు. ప్రస్తుతం బీసీ రిజర్వేషన్ల విషయంలో కోర్టు తీర్పుకోసం ఎదురుచూస్తూ ఉన్నారు.

పోలీసుల తనిఖీ

చర్ల: మండలంలో ఆదివారం పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. మండల కేంద్రమైన చర్లలో ఆదివారం జరిగే వారపు సంతకు సరిహద్దున ఉన్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా, బీజాపూర్, దంతెవాడ జిల్లాల్లోని అటవీ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ఆదివాసీలు తరలివస్తుండగా వారి మాటున మావోయిస్టులు, మిలీషియా సభ్యులు, కొరియర్లు రావచ్చునన్న అనుమానంతో పోలీసులు ఈ తనిఖీలు చేపట్టారు. చర్లకు వచ్చే ప్రధాన రహదారులైన లెనిన్‌కాలనీ, తాలిపేరు ప్రాజెక్టు, కలివేరు క్రాస్ రోడ్, చింతగుప్ప రోడ్‌లలో మోహరించిన పోలీసు బలగాలు వచ్చి పోయే ఆదివాసీలను నిశితంగా పరిశీలించారు. అనుమానితులుగా భావిస్తూ పలువురు ఆదివాసీలను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారించి నిర్ధారించుకున్న తరువాత విడిచి పెట్టారు. సీఐ రాజువర్మ, ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవ్‌లు తనిఖీలను నిర్వహించగా సివిల్, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం

అశ్వాపురం: అశ్వాపురం లయన్స్‌క్లబ్ స్టార్స్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో కాలువ బజార్ ఎస్సీ కాలనీలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామానికి చెందిన సుమారు 50 మందికి పైగా డయాబెటిక్, బీపీ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. లయన్స్‌క్లబ్ స్టార్స్ అధ్యక్షుడు నల్లగట్ల సత్యప్రకాష్, మెడికల్ టెక్నీషియన్లు కావేరి, సక్కుబాయి తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి ప్రతిష్ఠ.. కుంకుమార్చన



కుంకుమార్చన పూజలు చేస్తున్న మహిళలు

గుండాల: శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయ జీవధ్వజ శిఖర ప్రతిష్ఠ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండల కేంద్రంలో ఘనంగా కుంకుమార్చన, పంచామృత అభిషేకం నిర్వహించారు. పూజారులు కేతముక్కల పవన్ కుమార్ శర్మ, శ్రీరంగం సనత్ బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని మహిళలచే కుంకుమ పూజా కార్యక్రమం జరిపించారు. పంచామృతాలతో అభిషేకం చేశారు. దీంతో పాటు హోమం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం విగ్రహ ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠ కార్యక్రమాలు ఉంటాయని పూజారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ దాతలు పోలు కనకయ్య–రాజేశ్వరి, పోలు రమేష్–రేణుక, రిత్విక్, నాగరోహిత్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు ముఖ్య కార్యకర్తల సమావేశం

మణుగూరుటౌన్: పినపాక నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం సోమవారం 10 గంటలకు జరుగుతుందని, రానున్న పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఆశావహ అభ్యర్థులు హాజరై దరఖాస్తులు అందజేయాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గానికి చెందిన నాయకులు కార్యకర్తలు, పార్టీ తరఫున పోటీ చేయదలచిన వారు ప్రాదేశిక నియోజకవర్గం వారీగా, మండలాల వారీగా పూర్తి వివరాలతో జత చేసిన ఫార్మెట్‌ను అందించాలన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య హాజరవుతారని తెలిపారు.

వెంకటస్వామి జయంతి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో మాల మహానాడు ఆధ్వర్యంలో దివంగత నేత గడ్డం వెంకటస్వామి (కాకా) 96వ జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మానవ సేవా వృద్ధాశ్రమం, దివ్యాంగుల ఆశ్రమంలో కేక్ కట్ చేసి వృద్ధులు, దివ్యాంగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసి కార్మికులకు అనేక సమస్యలను పరిష్కరించారని కొనియాడారు. అల్లాడి పాల్ రాజ్, దామాల సత్యం, బుయ్యన వీరబాబు, డేగల శివ, జయరాజు, శాంతిరాజ్, పుట్టి రవి పాల్గొన్నారు.

శిథిలావస్థలో డిపో బస్టాండ్

- అభివృద్ధికి గతంలో రూ.5కోట్లు మంజూరు
- నిర్మాణ పనులకు కలగని మోక్షం
- అవస్థ పడుతున్న ప్రయాణికులు



డిపో ఎదుట శిథిలావస్థలో ఉన్న బస్టాండ్

మణుగూరురూరల్: గతంలో మండల, పరిసరాల ప్రాంతాల ప్రజలు బస్సు ఎక్కాలంటే ఆర్టీసీ డిపో వద్ద ఉన్న బస్టాండ్‌కు రావాల్సిందే. సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు డిపో బస్టాండ్‌కు రావాలంటే ఎంతో ప్రయాసగా ఉండేది. కాలక్రమేనా పెరుగుతున్న సాంకేతికత, పరిశ్రమల ఏర్పాటుతో రవాణా సౌకర్యం మెరుగు పడింది. ప్రజలందరి సౌకర్యార్థ శేషగిరినగర్ ప్రాంతానిక సమీపంలో సుర్షా బస్టాండ్‌ను ఏర్పాటు చేశారు. దీంతో డిపో బస్టాండ్ వాడుకలో లేకపోవడంతో సంవత్సరాలు గడిచే కొద్ది శిథిలావస్థకు చేరుకుంటోంది.

నిధులు విడుదలైనా..

గత ప్రభుత్వ హయాంలో స్థానిక ఎమ్మెల్యే రేగా కాంతారావు డిపో బస్టాండ్ అభివృద్ధిపై దృష్టి సారించారు. అందులో భాగంగా ఆనాటి రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు సమస్యను విన్నవించి డిపో బస్టాండ్ అభివృద్ధికి రూ.5కోట్ల నిధులను మంజూరీ చేయించారు. త్వరలోనే బస్టాండ్ రూపురేఖలు మారుతాయని భావించినప్పటికీ బస్టాండ్ అభివృద్ధి మాట మరుగునపడింది. దీంతో దీంతో నిత్యం రాకపోకలు సాగించే ఉద్యోగులు, ఉపాధ్యాయలు, అధికారులు, విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు.

అధికారులు, పాలకులు స్పందించాలి

డిపో బస్టాండ్‌కు పూర్వ వైభవం రావాలసి స్థానికులు ఆశిస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ.. బస్టాండ్ అభివృద్ధిపై దృష్టి సారించకపోవడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మంత్రులు, స్థానిక ఎమ్మెల్యే, జిల్లా అధికారులు స్పందించి డిపో బస్టాండ్ అభివృద్ధి చేసి ఇబ్బందులు తొలగించాలని ప్రయాణికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరుతున్నారు.

రాకపోకలకు దారేది?



చినరావిగూడెం వద్ద రాకపోకలకు ఆటంకంగా నిలిపిన లారీలు

మణుగూరుటౌన్: మున్సిపాలిటీలోని రాయిగూడెం, కమలాపురం వెళ్లాలంటే అక్కడి స్థానికులకు తిప్పలు తప్పడం లేదు. ఏ పని ఉండి మార్కెట్‌కి రావాలన్నా, అత్యవసర వైద్యం కోసం రావాలన్నా, వచ్చి తిరిగి ఇంటికి చేరాలన్నా గంటల తరబడి వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది. ఇసుక లారీలు అడ్డగోలుగా పదుల సంఖ్యలో నిలుపుతుండటంతో అక్కడి స్థానికులకు ఈ పరిస్థితి దాపురించింది. ఇక పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. ఇటీవల ఇసుక కోసం వచ్చే లారీ డ్రైవర్లు మద్యం సేవించడం, అతి వేగం ప్రదర్శించడంతో పలు ప్రమాదాలు జరిగాయి. దీనిపై స్థానికులు టీజీఎండీసీ అధికారులకు విజ్ఞప్తి చేసి బైఠాయించారు. సమస్య పరిష్కరిస్తామని చెప్పిన అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టలేదని, లోడింగ్ మరింత పెంచి తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా లారీల రాకపోకలకు ప్రత్యామ్నాయ మార్గం చూపి తాము పడుతున్న ఇబ్బందులు తప్పించాలని వేడుకుంటున్నారు.

బురదమయంగా రహదారి



ములకపాడు సెంటర్‌లో బురదమయంగా మారిన ప్రధాన రహదారి

దుమ్ముగూడెం: మండలంలో చర్ల–భద్రాచలం ప్రధాన రహదారిపై ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు చేపట్టిన పనులు వారి పనితీరుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. మండలంలోని ములకపాడు నుంచి రేగుబల్లి వరకు చర్ల–భద్రాచలం ప్రధాన రహదారిపై గోతులు ఏర్పడగా.. ఆ చోట్ల ఎర్రమట్టిని పోసి చేతులు దూలుపుకున్నారు. దీంతో వర్షం పడటంతో మట్టి కరిగి..ఆ ప్రాంతమంతా బురదమయంగా మారింది. ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారి మీద గోతులు ఏర్పడితే వెట్ మిక్స్‌తో పూడ్చాల్సిందిపోయి ఇలా ఎర్రమట్టితో నింపి మరో సమస్యను సృష్టించడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

కుండపోత వర్షం



పట్వారిగూడెంలో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

దమ్మపేట: మండలంలోని పలుచోట్ల ఆదివారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. వర్షంతో పాటుగా ఉరుములు, మెరుపులతో భారీ శబ్దాలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేశాయి. ఒక్కసారిగా భారీ వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. దమ్మపేట, పట్వారిగూడెం తదితర గ్రామాల్లో రోడ్లపై నీరు చేరుకుని, డ్రెయినేజీల్లో వర్షపు నీరు ప్రవహించింది.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం మండలంలో స్థానిక సంస్థల ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులను గెలిపించుకుని సత్తా చాటాలని మండల అధ్యక్షుడు తాళ్లూరు చిట్టిబాబు అన్నారు. కూనవరం రోడ్డులో ఆదివారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో కొడాలి శ్రీనివాసన్, కుంచాల రాజారాం, కంభంపాటి సురేష్ కుమార్, తాళ్లూరు చిట్టిబాబు, కొర్లపాటి రాము, ఊకె చుక్కమ్మ, ఆదినారాయణ, చిట్టి బాబు, జ్యోతిర్మయి, భాగ్యలక్ష్మి, అచ్యుతరావు పాల్గొన్నారు.

ఆలయాల్లో పూజలు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం వద్ద ఉన్న చిలకలగండి ముత్యాలమ్మ తల్లి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచే వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అలాగే అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. అదే విధంగా అన్నసమారాధన కార్యక్రమాలను నిర్వహించారు.

మాజీ ఉప సర్పంచ్ మృతి

మణుగూరురూరల్: మండల పరిధిలోని రామానుజవరం గ్రామపంచాయతీ మాజీ ఉప సర్పంచ్ నడికొప్పుల నారాయణ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు రామానుజవరంలోని వారి గృహానికి వెళ్లి నారాయణ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి ఘన నివాళ్లర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కుర్రి నాగేశ్వరరావు, నాయకులు వట్టం రాంబాబు, ముత్యం బాబు, తాళ్లపల్లి యాదగిరిగౌడ్, నూకారపు రమేష్, వేర్పుల సురేష్, అక్కి నర్సింహారావు, ప్రభుదాస్, రమణ, లక్ష్మణ్, నర్సింహారావు, రవిప్రసాద్ తదితరులు ఉన్నారు.

మంత్రి తుమ్మల నివాళి

దమ్మపేట: మండలంలోని గండుగులపల్లి గ్రామానికి చెందిన కోటగిరి శ్రీను మాతృమూర్తి లోలా, ఇటీవల అనారోగ్య కారణంగా మృతి చెందగా.. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం మృతురాలి చిత్రపటానికి పూలతో నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం సీతారామ ప్రాజెక్టు పంట కాలువల నిర్మాణం వల్ల వ్యవసాయ భూములకు నష్టం జరగకుండా చూడాలని రైతులు, మంత్రి తుమ్మలకు వినతిపత్రం అందజేయగా.. ఇబ్బంది లేకుండా చూస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కాసాని నాగప్రసాద్, కొయ్యల అచ్యుతరావు, చీకటి రామారావు, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వరుస చోరీలతో బెంబేలు

ములకలపల్లి: ప్రశాంతంగా ఉంటే ములకలపల్లి మండలంలో వరుసగా చోటు చేసుకుంటున్న చోరీ యత్నాలు, దొంగతనాలతో స్థానికులు బెంబేలెత్తుతున్నారు. నెలన్నర కాలంలో నాలుగు ఘటనలు చోటు చేసుకోవడంతో ప్రజల్లో ఆందోళన మొదలైంది. సత్వరమే పటిష్ఠ నిఘా ఏర్పాటు చేసి, ఆగంతకులను అరెస్ట్ చేయాలని కోరుతున్నారు.

ఈ మధ్య జరిగిన ఘటనలను పరిశీలిస్తే..

- రాజుపేటకు చెందిన భూక్యా నరేష్ ఇంటి ఆవరణలో బైక్‌ను పార్క్ చేసి ఉంచగా, ఆగస్టు 21న గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు.
- ములకలపల్లికి చెందిన ఇజ్జాడ శ్రీరామ్, వీరమహాలక్ష్మి పేరిట మెయిన్ సెంటర్‌లో గోల్డ్‌షాపు నిర్వహిస్తున్నాడు. ఆగస్టు 27న షాపు తాళాలు వేసి ఇంటికి వెళ్లి, 28 ఉదయం చూడగా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. అదృష్టవశాత్తూ మెయిన్ షట్టర్ తెరచుకోక పోవడంతో దొంగ వెనుతిరిగినట్లు తెలుస్తోంది.
- రాజుపేటలో నివసించే తుమ్మలపల్లి రాజేష్ ఇంటి ఆవరణలో కిరాణా షాపు నడుపుతున్నారు.
- బుధవారం రాత్రి షట్టర్‌కు తాళాలు వేసి ఇంటికి వెళ్లి, మరునాడు ఉదయం చూడగా, తాళాలు పగులగొట్టి ఉన్నాయి. రూ.60 వేల అపహరణకు గురైనట్లు గుర్తించి, పోలీసులను ఆశ్రయించాడు.
- శనివారం అర్ధరాత్రి మెయిన్ రోడ్డులోని ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీకి యత్నించగా, పోలీసులు రావడంతో ఆగంతకుడు పరారయ్యాడు.

అపరిచితుల సమాచారమివ్వండి: ఎస్‌ఐ

చోరీల నివారణకు ప్రత్యేక దృష్టి సారిస్తామని ములకలపల్లి ఎస్‌ఐ ఎస్.మధుప్రసాద్ తెలిపారు. దుకాణాల్లో విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, రాత్రి వేళల్లో ఇళ్లు, షాపుల ముందర లైట్లు వేసి ఉంచాలని సూచించారు. ద్విచక్ర వాహనాలకు హ్యాండిల్ లాక్ వేసుకోవాలని, అపరిచిత వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



విద్యుత్ స్తంభాన్ని అల్లుకుపోయిన చెట్లు

దుమ్ముగూడెం: మండలంలోని చిన్న బండిరేవు గ్రామంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ ఇంటికి వెళ్లే రహదారిలో ఓ విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉంది. విద్యుత్ స్తంభం చుట్టూ మొత్తం కింద నుంచి పై వరకు తీగలతో సహా పిచ్చి చెట్టు అల్లుకుపోయి ఉంది. దీంతో వర్షం పడిన సమయంలో ఆ ప్రాంతంలో శబ్దం వస్తోందని, పిల్లలు ఆ ప్రాంతంలో ఎక్కువగా తిరుగుతుంటారని స్థానికులు చెబుతున్నారు. తీగలను తొలగించాలని అధికారులకు తెలిపిన పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరగక ముందే తీగలను వెంటనే తొలగించాలని వారు కోరుతున్నారు.

పోటీకి దరఖాస్తుల స్వీకరణ



దరఖాస్తులను స్వీకరిస్తున్న డీసీసీ అధ్యక్షుడు వీరయ్య, ఎమ్మెల్యే జారె

దమ్మపేట: త్వరలో జరగనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీచేయదలచిన కాంగ్రెస్ పార్టీ నాయకుల నుంచి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ చేతుల మీదుగా ఆదివారం దరఖాస్తులను స్వీకరించారు. అశ్వారావుపేట నియోజకవర్గం నుంచి వందల సంఖ్యలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆశావహులు, తాము పోటీచేయాలనుకున్న పదవి, స్థానం తదితర వివరాలతో దరఖాస్తులను మండలంలోని గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తోట దేవిప్రసన్న, టీపీసీసీ జనరల్ సెక్రటరీ ధర్మారావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సేవాదళ్ నాయకులు, సోషల్ మీడియా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా నిమజ్జనాలు



నిమజ్జనానికి తరలుతున్న దుర్గామాత విగ్రహం

భద్రాచలంటౌన్: భద్రాచలం గోదావరి తీరంలో ఏర్పాటు చేసి నిమజ్జన ఘాట్ వద్ద దుర్గా మాత విగ్రహాల నిమజ్జన వేడుక ఉత్సాహంగా జరుగుతుంది. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో తొమ్మిది రోజుల పాటు మండపాల్లో దుర్గా అమ్మవారికి ఘనంగా పూజలు నిర్వహించిన భక్తులు నిమజ్జనం కోస భద్రాచలం గోదావరి నదికి తీసుకువస్తున్నారు. గత మూడు రోజులుగా వస్తున్న దుర్గా మాత విగ్రహాలు తరలివస్తుండడంతో అధికారులు ప్రత్యేకంగా క్రేన్లతో పాటు సిబ్బందిని నియమించి లాంచీల ద్వారా నదిలో నిమజ్జనానికి చేస్తున్నారు. ఆదివారం సైతం చిన్న, భారీ అమ్మవారి విగ్రహాలు పెద్ద ఎత్తున నిమజ్జనం జరిగినట్లు అధికారులు తెలిపారు.

ఒత్తిడిని జయించడంపై అవగాహన



మాట్లాడుతున్న లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మీరాహుస్సేన్

మణుగూరురూరల్: లయన్స్ ఇంటర్నేషనల్ మెంటల్ హెల్త్ అండ్ వెల్‌బీయింగ్‌లో భాగంగా లయన్స్ క్లబ్ ఆఫ్ మణుగూరు ఆధ్వర్యంలో ఆదివారం తెలంగాణ చౌరస్తా ప్రాంతంలో హమాలీలకు ఒత్తిడిని జయించడం ఎలా? అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు, జిల్లా ఆంగ్ల రీసోర్స్ పర్సన్ షేక్ మీరాహుస్సేన్ మాట్లాడుతూ.. ఆత్మీయ పలకరింపులు, స్నేహితులు, బంధువులతో సమయాన్ని కేటాయించడం వల్ల ఒత్తిడిని తగ్గించుకోవచ్చన్నారు.అలాగే నిత్యం యోగా, ధ్యానం అలవాటు చేసుకుని ఆచరిస్తే మానసిక ప్రశాంతత, ఆరోగ్యం లభిస్తుందని తెలిపారు. అనంతరం క్లబ్ ఆధ్వర్యంలో శ్రీదేవి మెడికల్ షాప్ వద్ద ఉచిత బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ జోన్ చైర్‌పర్సన్ ముత్తంశెట్టి నాగేశ్వరరావు, కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, క్లబ్ సభ్యులు సురేష్, అడబాల నాగేశ్వరరావు, హమాలీలు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న సభ్యులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని తెలంగాణ టూరిజం హోటల్‌లో ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ భద్రాచలం విస్తృత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ ఆఫ్ భద్రాచలం శ్రీ రామ నూతన క్లబ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు. అధ్యక్షుడిగా చల్లగుండ్ల నాగేశ్వరరావు, కార్యదర్శిగా భూక్య రంజిత్, కోశాధికారిగా జి.భరత్ లను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. నూతన కమిటీ ప్రమాణ స్వీకారం అక్టోబర్ 11వ తేదీన గవర్నర్ సమక్షంలో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఎన్నికైన అధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారులను నిర్వహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లైన్స్ క్లబ్ రీజనల్ చైర్మన్ కురిచేటి శ్రీనివాసరావు, కార్యదర్శి సిద్ధారెడ్డి, మాజీ అధ్యక్షుడు చావా లక్ష్మీనారాయణ, హరిచంద్ర నాయక్, సోమశేఖర్, బాల నర్సారెడ్డి, గాదె మాధవరెడ్డి, బి వెంకటరెడ్డితో పాటు సభ్యులు రంగారెడ్డి, కంభంపాటి సురేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

భగీరథ లీకులతో రోడ్లు బురద



రోడ్డుపై పారుతున్న లీకైన నీరు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని పలు కాలనీలలోని ప్రధాన రహదారిలో పలు చోట్ల మిషన్ భగీరథ నీరు లీకులు కావడంతో రోడ్లు బురదమయం అవుతున్నాయి. రోడ్లపై నీరు లీకు అవుతుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజుల తరబడి నీరు నిలవడంతో రోడ్ల సైతం పాడైపోతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకుని లీకులకు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

25 ఏళ్ల తర్వాత సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999–2000 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు దసరా సందర్భంగా శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఉత్సాహంగా జరుపుకున్నారు. ఎక్కడెక్కడో ఉన్న అందరూ ఇరవై ఐదు ఏండ్లకు తాము చదువుకున్న పాఠశాలలో ఒక్క చోట చేరి తమ గత జ్ఞాపకాలు నెమరువేసుకొని.. ప్రస్తుతం ఏం చేస్తున్నారు, కుటుంబాల వివరాలు తదితర విషయాలను ఒకరినొకరు పంచుకొని రోజంతా ఉత్సాహంగా గడిపారు.

విద్యాబుద్ధులు నేర్పిన గురువులను, పాఠశాల అటెండర్‌గా చేసిన భాస్కర్‌ను శాలువాలతో సన్మానించారు.

ఖాళీ స్థలంలో వ్యర్థాలు



వ్యర్థాలతో నిండి ఉన్న స్థలం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని గ్రామ పంచాయతీ పరిధిలోని ఐటీడీఏ రోడ్డులో ఉన్న నివాస ప్రాంతంలో ఖాళీస్థలంలో వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. వీటి కారణంగా ఆ పరిసర ప్రాంతంలోని ప్రజలు అనారోగ్య బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు సదరు స్థలం యజమానులకు నోటీసులు అందజేసి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.